సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



అన్నదాన ట్రస్టుకు రూ.50 వేలు


సామర్లకోట: బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలోని అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన ఓ దాత రావుల పాండరీనేత్ర హేమలత పేరున రూ.50 వేలు విరాళం అందించారు.



భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కొరుప్రోలు నాగసూర్యకాంతం (అమలాపురం) రూ 1,00,116 విరాళం అందజేశారు.

1.70 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 1,70,803 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,700 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జాతీయ రహదారి 216పై జొన్నాడ వద్ద సుమారు రూ.120 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో జొన్నాడ ఫ్లైఓవర్ పనుల పురోగతిపై జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజినీర్లు, గుత్తేదారులతో ఆయన సమీక్షించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జేసీ టి.నిషాంతి, రాజమహేంద్రవరం జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకులు సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ చెరువులకు విద్యుత్ నిలిపివేయాలి

అనుమతులు లేకుండా దేవదాయ తదితర ఆక్రమిత భూముల్లో నిర్వహిస్తున్న ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ట్రాన్స్‌కో, మత్స్యశాఖ, పోలీస్ విభాగాలను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల్లో 688 ఎకరాల్లో ఆక్వా రంగానికి సంబంధించి అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారన్నారు. అనుమతులు లేని ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బి.కృష్ణారావు, ఆర్డీఓ జి.కేశవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే లైన్ అలైన్‌మెంట్‌పై స.హ. చట్టం కింద దరఖాస్తు

అమలాపురం టౌన్: కోటిపల్లి–నరసాపురం మధ్య నిర్మించనున్న కోనసీమ రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను ఇప్పటికి పలుమార్లు మార్చడానికి గల కారణాలను తెలపాలంటూ అమలాపురానికి చెందిన సామాజిక కార్యకర్త గాబ్రియేల్ ప్రకాష్‌రాజు కొంకి సమాచార హక్కు చట్టం ద్వారా స్థానిక కలెక్టరేట్‌లో దరఖాస్తు చేశారు. కోనసీమ రైల్వే సాధన సమితి ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సూచనలతో సమాచార చట్టం ద్వారా ఈ లైన్ నిర్మాణంలో చోటుచేసుకుంటున్న అంశాల వారీగా సమాచారాన్ని కోరానని గాబ్రియేల్ తెలిపారు. అలైన్‌మెంట్ తదితర అంశాలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను ఈ సమాచారం ద్వారా నివృత్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 57 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ రైల్వే లైన్‌కు ఇప్పటి వరకూ సేకరించిన భూమి, ఇంకా సేకరించాల్సిన వాటిపై సమాచారం ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకూ ఈ లైన్‌కు సంబంధించి పర్యావరణం, భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం వంటి అంశాలపై పబ్లిక్ హియరింగ్ ఎందుకు జరపలేదనే విషయాలపై వివరణ ఇవ్వాలని అన్నారు.

విచారణకు ఆదేశాలు

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ఆదేశించింది. దీనికి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్న విద్యా మండలి చైర్మన్ కె.రామ్మోహన్‌రావు ఆదేశాలు జారీ చేశారు. పది రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ విచారణ కమిటీలో సభ్యులుగా రాష్ట్ర కళాశాలల విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి.కృష్ణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డి.జ్యోతిర్మయి, గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ ఎస్ఎన్ రవికుమార్‌లను నియమించారు. కొంత కాలంగా ఈ విద్యా సంస్థల్లో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విద్యా మండలికి చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ కమిటీ వేసినట్లు ఉన్నత విద్యా మండలి జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. కళాశాలలో జరిగిన అవినీతి, అక్రమాల ఆరోపణలతో పాటు, సిబ్బందికి జీతాలు ఎందుకు ఇవ్వడం లేదనే అంశాలపై విచారణ చేయనున్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈగా రాజబాబు

అమలాపురం రూరల్: ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా ఎస్.రాజబాబు నియమితులయ్యారు. 2022లో జిల్లాల విభజన జీఓ ప్రకారం నోడల్ ఆఫీసర్‌గా ఈఈ మోకా రవికుమార్ ఇప్పటి వరకూ పని చేశారు. జిల్లాలో కొత్తగా ఏపీఈపీడీసీఎల్ అమలాపురం సర్కిల్ ఆఫీస్ సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా రాజబాబును నియమించారు. అలాగే టెక్నికల్ కనెక్షన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా వై.విజయానంద్, రామచంద్రపురం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.రత్నారావు బాధ్యతలు స్వీకరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎంఆర్‌టీ)గా మల్లిక నియమితులయ్యారు.

పాపం తమ్ముళ్లు.. సైనికులు



మానేపల్లి అయ్యాజీ వేమా



బండారు శ్రీనివాసరావు



రెడ్డి సుబ్రహ్మణ్యం



వేగుళ్ల లీలాకృష్ణ




పోలిశెట్టి చంద్రశేఖర్



పేరాబత్తుల రాజశేఖర్

- కార్పొరేషన్ పదవుల్లో మొండిచేయి
- జిల్లాకు ఒక్క చైర్మన్ కూడా లేదు
- నలుగురికి మాత్రమే డైరెక్టర్లు
- కంగుతిన్న ఆశావహులు
- సీటు త్యాగం చేసిన వారికీ చుక్కెదురు



సాక్షి, అమలాపురం: ఎంతో ఆశించారు.. మరెంతో ఊహించుకున్నారు.. చివరికి భంగపాటుకు గురయ్యారు.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన నామినేటెడ్ పదవుల గిఫ్ట్ చూసి ఇటు తెలుగు తమ్ముళ్లు.. అటు జనసేన, బీజేపీ నేతలు కంగుతిన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేసే అవకాశం కోల్పోయిన అభ్యర్థులు, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీలకు రక్షణగా నిలిచిన నాయకులు నామినేటెడ్ పదవులపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. తీరా పదవుల పంపకంలో జిల్లాకు అన్యాయం జరిగిందంటూ లబోదిబోమంటున్నారు. జిల్లాకు ఒక్క చైర్మన్ పదవీ కేటాయించకపోగా, ఇచ్చిన నాలుగు డైరెక్టర్ల పదవుల్లోనూ కీలక నేతలకు అవకాశం రాక కూటమి క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం 20 వివిధ కార్పొరేషన్లలో చైర్మన్, డైరెక్టర్ పదవులకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ఎంపిక చేసింది. వీటిపై కూటమి భాగస్వామ్య పార్టీలకు చెందిన నాయకులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. స్థానిక దేవస్థానం పాలక మండలి సభ్యుడి పదవి నుంచి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ వరకూ ప్రతి పదవినీ ఆశిస్తున్న నాయకులు జిల్లాలో లెక్కకు మిక్కిలి ఉన్నారు. కానీ తాజాగా ప్రకటించిన కార్పొరేషన్లలో ఒకరంటే ఒకరికీ కూడా చైర్మన్ గిరి దక్కలేదు. ఇది సరికాదా ఇచ్చిన నాలుగు డైరెక్టర్ పదవులు పొందిన వారు సైతం సంతృప్తి చెందడం లేదు. టీడీపీ నుంచి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మోకా ఆనందసాగర్, ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, ఏపీ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యునిగా నాగిడి నాగేశ్వరరావులను, జనసేన నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా గుండుబోగుల నరసింహారావులను ఎంపిక చేశారు. ఇందులో ఆనందసాగర్ పి.గన్నవరం నుంచి టిక్కెట్ ఆశించి పొత్తులతో అవకాశం కోల్పోగా, జగదీశ్వరి గతంలో ఎమ్మెల్యేగా చేయగా ఇప్పుడు డైరెక్టర్‌కు పరిమితమయ్యారు. మత్స్యకార వర్గానికి చెందిన నాగేశ్వరరావు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఆశించి డైరెక్టర్‌తో సరిపెట్టుకోవాల్సి రావడంతో వీరు పదవులు పొందినా అసంతృప్తితో ఉన్నారు.

చాంతాడంత జాబితా

జిల్లాలో టీడీపీ, జనసేనల నుంచి నామినేటెడ్ పదవులకు ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. టీడీపీ నుంచి ఎమ్మెల్యే స్థాయి నాయకులు కూడా పదవులు ఆశించారు. అలాంటి వారిలో టీడీపీ సీనియర్ నేత రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్)కు మొండి చేయి మిగిలింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఆయన ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో పాటు శాసనమండలి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ఈసారి ఎన్నికల్లో రామచంద్రపురం నుంచి పోటీ చేయాల్సి ఉంది. ఇన్‌చార్జిగా సేవలందించారు. చివరి నిమిషంలో టిక్కెట్ కోల్పోయారు. ఇతని స్థానంలో పోటీ చేసిన వాసంశెట్టి సుభాష్ ఏకంగా రాష్ట్ర మంత్రి కాగా, ఆర్ఎస్‌కు మాత్రం నామినేటెడ్ పదవిలోనూ అవకాశం రాలేదు. కొత్తపేట నియోజకవర్గానికి చెందిన కాపు ఉద్యమ నాయకుడు ఆకుల రామకృష్ణ సైతం రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. ఇతనితోపాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డిలు సైతం కార్పొరేషన్ రేసులో ఉన్నారు. పి.గన్నవరం త్రీమెన్ కమిటీ సభ్యునిగా ఉన్న జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ మాజీ డైరెక్టర్ డొక్కా నాథ్‌బాబులకు సైతం అవకాశం దక్కలేదు. రామచంద్రపురం నియోజకవర్గంలో టీడీపీ నుంచి మేడిశెట్టి శేషారావు, టేకుమూడి సత్యనారాయణ, వైట్ల గజలక్ష్మి, ముమ్మిడివరం నుంచి తాడి నరసింహం, గతంలో ముమ్మిడివరం అసెంబ్లీ నుంచి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసిన గుత్తుల సాయి, పేరాబత్తుల రాజశేఖర్, అమలాపురానికి చెందిన మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మట్ట మహాలక్ష్మి ప్రభాకర్, ఉప్పలగుప్తం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, రాజోలు నుంచి అడబాల సాయిలు పదవులు ఆశిస్తున్నా మొండిచేయి చూపారు.



నామన రాంబాబు

జనసేనలో నిస్పృహ

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేసే అవకాశం కోల్పోయిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులకు తాజా నామినేటెడ్ పదవుల్లో సైతం అవకాశం దక్కలేదు. కొత్తపేట, రామచంద్రపురం, మండపేట పార్టీ ఇన్‌చార్జులుగా ఉన్న బండారు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, వేగుళ్ల లీలా కృష్ణలు నామినేటెడ్ చైర్మన్ పదవులు ఆశిస్తున్నారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినా ఐదేళ్ల పాటు పార్టీని నియోజకవర్గంలో నడిపించేందుకు అష్టకష్టాలు పడ్డారు. తీరా ఎన్నికల సమయంలో పొత్తుల పేరుతో వీరికి అవకాశం కలిప్రంచలేదు. ఇప్పుడు ఇచ్చిన నామినేటెడ్ పదవుల్లో సైతం అవకాశం దక్కకపోవడంతో వారు నీరశించారు. అమలాపురంలో నల్లా శ్రీధర్ సైతం పార్టీకి ఆర్థికంగా ఖర్చు చేశారు. ఇతనితో పాటు లింగోలు పండు, ఆకుల బుజ్జి, రాజోలు నుంచి టిక్కెట్ ఆశించి భంగపడిన రాపాక రమేష్ బాబులు పదవులను ఆశిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా బీజేపీ జెండా మోస్తున్న మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, మోకా సుబ్బారావు, జెంగా రాజేంద్రకుమార్, పార్టీ సీనియర్ నాయకులు నల్లా పవన్‌కుమార్, యాళ్ల దొరబాబు, పాలూరి సత్యానందం, ఆర్‌వీ నాయుడు వంటి వారు సైతం రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నా ఫలితం దక్కలేదు.

క్షతగాత్రులకు రూ.1.90 లక్షల సాయం



క్షతగాత్ర కుటుంబాలకు సాయాన్ని అందిస్తున్న శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల అమలాపురం పట్టణం రావులచెరువు ప్రాంతంలో విస్ఫోట ధాటికి ఇల్లు తునాతునకలై తీవ్రంగా గాయపడిన ఏడుగురికి శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ. 1.90 లక్షల సాయాన్ని సమకూర్చింది. ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తాన్ని ఆ సంస్థ ప్రతినిధులు అందించి అండగా నిలిచారు. శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధుల బృందం బుధవారం రాత్రి రావులచెరువు వెళ్లి క్షతగాత్ర కుటుంబాలకు సాయాన్ని అందించారు. ఆ సంస్థ ప్రతినిధులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, కుడుపూడి బాబు, ఎంఎం శెట్టి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, గొవ్వాల రాజేష్ , చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, కముజు రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ప్రసాద్

అమలాపురం టౌన్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎస్‌కేవీడీ ప్రసాద్ నియమితులయ్యారు. కాకినాడ జిల్లా సామర్లకోట ఏపీ బేవరేజస్ లిక్కర్ డిపో మేనేజర్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఈ మేరకు గురువారం అమలాపురంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేశాక అమలాపురం ఎస్ఈబీ జిల్లా కార్యాలయం జిల్లా ఎక్సైజ్ అధికారి, సూపరింటెండెంట్ కార్యాలయంగా మారింది. గతంలో మాదిరిగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం, ఎక్సైజ్ స్టేషన్ విధులు మొదలు కానున్నాయి.

చిట్టబ్బాయి విగ్రహాన్ని తొలగిస్తే ఊరుకోం..

- అన్నింటితో పాటు సమానంగా చూస్తే సరి
- లేకుంటే ఉద్యమిస్తామని శెట్టిబలిజ సంఘాల హెచ్చరిక



అమలాపురంలో చిట్టబ్బాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కోనసీమ శెట్టిబలిజ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం గడియారం స్తంభం సెంటర్ సమీపంలోని గుర్రపు బండ్ల సెంటర్‌లో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంతో పాటు అన్ని అనుమతులతో నిర్మించిన మాజీ ఎమ్మెల్యే, జిల్లా శెట్టిబలిజ నేత దివంగత కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహాన్ని ట్రాఫిక్ దృష్ట్యా తొలగించాలని ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లిన అంశంపై కోనసీమ శెట్టిబలిజ సంఘాల ప్రతినిధుల సమావేశం చర్చించింది. తొలుత స్థానిక సూర్యనగర్‌లో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కోనసీమ శెట్టిబలిజ నేత మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టితో పాటు పలు సంఘాల పెద్దలు మాట్లాడారు. ట్రాఫిక్ పేరుతో చిట్టబ్బాయి విగ్రహాన్ని తొలగిస్తే.. అలాగే పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న మిగిలిన దివంగత రాజకీయ నేతల విగ్రహాలన్నీ తొలగించాలన్నారు. అలా కాదని ఒక్క చిట్టబ్బాయి విగ్రహాన్ని మాత్రమే తొలగిస్తే జిల్లాలోని శెట్టిబలిజ సామాజిక వర్గీయులు, సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని సమావేశం హెచ్చరించింది. అదే జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేసింది. సామాజిక వర్గాల మధ్య తగాదాలు సృష్టించ వద్దని హితవు పలికింది. మున్సిపాలిటీ కూడా చిట్టబ్బాయి విగ్రహంపై ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లిన విషయాన్ని కౌన్సిల్ అజెండాలో చేర్చి కౌన్సిల్ దృష్టికి తీసుకురాకుండా ఎందుకింత రహస్యాన్ని పాటిస్తుందని అంటూ తప్పుపట్టారు. పట్టణంలో కొందరు నేతలు వారు చేసిన త్యాగాలు, సేవలకు గుర్తింపుగా ఆయా సామాజిక వర్గాలు వారి విగ్రహాలను నెలకొల్పుకున్నాయని గుర్తు చేశారు. అలాంటి నేతల విగ్రహాలను తొలగించే యోచనకు ఎవరూ రావొద్దని సమావేశం పేర్కొంది. సూర్యనగర్‌లో సమావేశం అనంతరం నాయకులంతా చిట్టబ్బాయి విగ్రహం వద్దకు వచ్చి ఘన నివాళులర్పించారు. అంబాజీపేట మండల పరిషత్ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కుడుపూడి బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, శెట్టిబలిజ సంఘాల నాయకులు కముజు రమణ, కుడుపూడి భరత్ భూషణ్, విత్తనాల శేఖర్, గుత్తుల రాజు తదితరులు ప్రసంగించారు.

ఏం సాధించారని వంద రోజుల పండగ

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సాధించిందేమీ లేదని, అయినా వంద రోజుల పండగ చేస్తుండడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు థాలి బజావో నిరసనలో భాగంగా అమలాపురం కలెక్టరేట్ ఎదుట బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్టీలు పళ్లెలు, గరిటెలతో శబ్దం చేస్తూ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించారన్నారు. వంద రోజుల ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, డ్వాక్రా రుణ మాఫీలను పక్కాగా అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను రద్దు చేసి, విద్యను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేయడం కూటమి ప్రభుత్వ వైఫల్యమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తి.తి.దే లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు, తల్లికి వందనం తదితర పథకాలను తక్షణం అమలు చేయాలన్నారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఏఐసీసీ సభ్యులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, బీసీ సెల్ జిల్లా చైర్మన్ కుడుపూడి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయితాబత్తుల సుభాషిని తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం కలెక్టరేట్ వద్ద జరిగిన దీక్షలో మాట్లాడుతున్న కొండేటి చిట్టిబాబు

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

రాయవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకునేందుకు గడువును అక్టోబరు 3వ తేదీ వరకూ పెంచారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు డి.దేవానందరెడ్డి విడుదల చేసిన ప్రకటన మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరింది. అలాగే ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును సంబంధిత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించడానికి అక్టోబరు 14 తేదీ గడువుగా పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ ప్రవేశ దరఖాస్తుకు అర్హులు. కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ కార్డులో ఉన్న విధంగానే పేరు నమోదు చేయాలి. అప్పుడు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదు. అయితే పరీక్ష రాసే సమయానికి అన్ని ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుం చెల్లించాలి. ఇతర వివరాలను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలుసుకోవచ్చు.

వైఫల్యమా... అలక్ష్యమా!

- విస్ఫోటం వెనుక అధికారుల పర్యవేక్షణ లోపం
- బాణసంచా తయారీదారుల నిర్లక్ష్యమూ కారణమే..



రావులచెరువులో విస్ఫోటంలో తునాతునకలైన ఇంటి శకలాలు

అమలాపురం టౌన్: వెలుగుల పండగ దగ్గర పడుతోంది.. దీపావళికి ఆహ్వానం పలుకుతోంది.. ఈ వెలుగుల వెనుక ప్రమాదాన్నీ సూచిస్తోంది.. బాణసంచా తయారీదారులు నిబంధనలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం భారీ మూల్యానికి కారణమవుతోంది.. ఈ నెల 16న అమలాపురంలో జరిగిన విస్ఫోటం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురిచేసింది. ఇక్కడి నల్లవంతెన సమీపంలోని రావులచెరువు ప్రాంతంలో ఓ ఇంట్లో సంభవించిన విస్ఫోటం విషాదం మిగిల్చింది.. దీని వెనుక రెండు కోణాల్లో వైఫల్యాలు కనిపిస్తున్నాయి. అగ్నిమాపక దళం, రెవెన్యూ, పోలీసు శాఖలు, సేఫ్టీ విభాగం అధికారుల నిఘా లోపం ప్రధాన కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇళ్ల మధ్య కొన్నేళ్ల నుంచి బాణసంచా తయారీ జరుగుతున్నా దానిని గుర్తించడంలో వైఫల్యమా..? తెలిసినా చర్యలు తీసుకోని అలక్ష్యమా..? అనేవి ప్రజల ప్రశ్నలు. 'నివాసాల మధ్య బాణసంచా తయారీ వద్దని తాము చెబుతూనే ఉన్నామని రావులచెరువు వాసులు అధికారుల ముందు ఇప్పుడు చెబుతున్నారే తప్ప అంతకు ముందు ఈ సమస్యపై ఫిర్యాదు చేసి ఉంటే ఈపాటికే పరిష్కారం లభించేది. ఇంత నష్టం సంభవించేది కాదు. ఈ ఘటనలో తునాతునకలైన ఆ ఇంటి శకలాల నుంచి ఇప్పటికే విజయవాడ ఫోరెన్సిక్ నిపుణుల బృందం నమూనాలు సేకరించి వెళ్లింది. త్వరలోనే ఆ బృందం జిల్లా ఎస్పీకి నివేదిక ఇవ్వనుంది. ఈలోగా అమలాపురం అగ్నిమాపక దళం ఈ విస్ఫోటం బాణసంచా తయారీ వల్లే జరిగిందని తేల్చి చెప్పింది. ఇప్పటికే ఘటనపై ఆ ఇంటి యాజమాని గొవ్వాల నాగేశ్వరరావు, అతని కుమారుడిపై పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం మీద విస్ఫోటం ధాటికి తీవ్రంగా గాయపడిన గొవ్వాల నాగేశ్వరరావు కుటుంబీకుల్లో ఓ ప్రాణం గాలిలో కలిసిపోయింది. నాగేశ్వరరావు భార్య నాగలక్ష్మి ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి చికిత్స పొందుతూ మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. మిగిలిన ఏడుగురు ఆసుపత్రిలోనే ఇంకా చికిత్స పొందుతున్నారు. అయితే వారికి ప్రాణహాని లేకపోయినప్పటికీ శరీరంలో పలుచోట్ల కాలిపోయి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదంలో సమీప ఇళ్లకు చెందిన మరో ఆరుగురు స్వల్పంగా గాయపడి, ఆ రోజే ప్రాథమిక చికిత్స పొంది తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

ప్రమాదం జరిగిందిలా..

ఇంట్లో బాణసంచా తయారు చేస్తున్నప్పుడు (కూరేటప్పుడు) మందులు ఒత్తిడికి గురై తొలుత నిప్పు పుట్టింది. తర్వాత పొగలు, మంటలతో అవి ఇంట్లో ఉన్న రెండు వంట గ్యాస్ సిలిండర్లకు ఎగబాకి అవి పెద్ద శబ్దంతో పేలిపోయాయి. సాధారంగా బాణసంచా తయారీకి అధికారిక లైసెన్స్ ఇచ్చినప్పటికీ ఆ తయారీ కేంద్రం జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయిస్తారు. అగ్ని ప్రమాదం అనివార్యమైతే అక్కడ నీరు, ఇసుక వంటి నిల్వలు కూడా సిద్ధంగా ఉంచుతారు. అయితే రావులచెరువులో విస్ఫోటం సంభవించిన ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావు కుటుంబం అధికారుల నుంచి బాణసంచా తయారీకి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే, అదీ నివాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా కొన్నేళ్లుగా తయారు చేస్తున్నారనేది స్థానికుల ఆరోపణ. ప్రమాదంలో ఆ ఇంట్లో వారే కాకుండా ఇరుగు పొరుగు వారు మొత్తం 14 మంది గాయపడిన విషయం విదితమే.

అదే జరిగితే మృత్యు కుహరంలోకే..

ఆ ఇంట్లో విస్ఫోటంతో పొగలు, మంటలు చెలరేగుతున్న సమయంలో అక్కడున్న వారు ప్రాణభయంతో ఇంటికి కుడివైపు ఉన్న వంటింట్లోకి వెళ్లి తలదాచుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఆ డాబా ఇంటి స్లాబ్ ఎడమవైపు ఒక్కసారిగా కూలడం, తక్షణమే తునాతునకలు కావడం అన్నీ రెప్పపాటులో జరిగిపోయాయి. ఇంట్లో వారు స్లాబ్ పడని వైపునకు వెళ్లడంతో వారు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. అదే ఎడమవైపు గదుల్లోకి వెళ్లి ఉంటే స్లాబ్ పడి అందరూ ప్రాణాలు కోల్పోయే వారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

క్లుప్తంగా

రేపు నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిధి ఆప్‌కే నికట్ డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–2 వైడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం లెనోరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో, కాకినాడ జిల్లా కాకినాడ అదానీ విల్మార్ లిమిటెడ్‌లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం పీఏసీఎస్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సభ్యులకు సేవలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నిధి అప్‌కే నికట్ జరుగుతుందని అన్నారు. ఈపీఎఫ్ఐజీఎంఎస్‌లు, ఇతర ఫిర్యాదుల దాఖలు నిబంధనలు, దావా తిరస్కరణ కారణాలు, స్కీమ్ సర్టిఫికెట్ ప్రయోజనాలు తదితర అంశాలపై జరుగుతుందన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిస్‌మెంట్‌లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిస్‌మెంట్‌లు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. నిధి ఆప్‌కే నికట్ అని పేర్కొంటూ తమ ఫిర్యాదులను సమర్పించవచ్చన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చని శ్రీనివాస్ కోరారు.

బాబూ... తీయొద్దు మా జాబు

బాబు వస్తే జాబు అన్నారు... కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నదే ఊడగొడుతున్నారు.. కొత్త మద్యం పాలసీ తెచ్చి ఆ దుకాణాల్లో ఉద్యోగుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేశారు.. వంద రోజుల పాలనలో ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ విధానం ఎంతో మంది ఉద్యోగుల జీవనాన్ని దెబ్బతీయగా, మరిన్ని రోజుల్లో మరింత మందికి ఎలా ఎసరో పెడతారో అని అంతా చర్చించుకుంటున్నారు. ఏదేమైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

- వచ్చే నెల 1 నుంచి నూతన మద్యం పాలసీ
- అగమ్యగోచరంగా మద్యం షాపుల్లో ఉద్యోగుల పరిస్థితి
- ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వానికి వినతి


కొత్తపేటలో ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగులు

కొత్తపేట: నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి కొందరి ఉద్యోగాలకు ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేస్తామని ప్రకటించడంతో వీరిలో ఆందోళన నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు ప్రభుత్వ మద్యం షాపుల నిర్వహణకు ఉద్యోగులను నియమించింది. ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు చూపించింది. సూపర్‌వైజర్, సేల్స్‌మేన్, నైట్ వాచ్‌మెన్ తదితర ఉద్యోగాల ద్వారా ఒక్కో షాపులో నలుగురు నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండటంతో తమ భవిష్యత్ ఏంటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

అప్పుడిచ్చారు.. ఇప్పుడు తీసేస్తున్నారు

2019కి ముందు మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాలు కేటాయించే వారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ సర్కారు ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది.

అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఏపీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ల ద్వారా నియామకాలు చేపట్టింది. అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 418 మద్యం షాపులు ఉండగా, 1,590 మంది ఉద్యోగులుగా పని చేస్తున్నారు. సూపర్ వైజర్లకు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్లకు రూ.18,500, నైట్ వాచ్‌మెన్లకు రూ.10 వేలు వేతనంగా చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా రోడ్డున పడనున్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీసీఓఈడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని బాధితులు వేడుకుంటున్నారు. ఈ మేరకు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు జిల్లా కేంద్రం అమలాపురంలో నిరసన తెలిపి మద్యం డిపో మేనేజర్ దశమంతరావుకు వినతిపత్రం సమర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మద్యం దుకాణంలో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నాను. నూతన మద్యం పాలసీతో నా ఉద్యోగం ఉంటుందో ఊడుతుందోనని ఆందోళనగా ఉంది. మాలాంటి వందలాది కుటుంబాలు మద్యం దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తమను ఆదుకోవాలి.
–గుబ్బల దుర్గాప్రసాద్, మద్యం ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు, కోనసీమ జిల్లా

రోడ్డున పడకుండా చూడాలి



ప్రభుత్వ మద్యం పాలసీకి మేం వ్యతిరేకం కాదు. అయితే మా కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నాం. ఒక్కసారిగా కొత్త విధానంతో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న మాకు ఇబ్బంది ఎదురవుతోంది. ఉద్యోగ భద్రత కల్పించాలి.
–గొల్లపల్లి చంటిబాబు, మద్యం ఉద్యోగుల సంఘ జిల్లా సెక్రటరీ, కొత్తపేట

మహిళను మోసగించిన వ్యక్తికి 12 ఏళ్ల జైలు

అన్నవరం: పెళ్లి చేసుకుంటానని ఓ మహిళను నమ్మించి మోసగించిన కేసులో ఓ వ్యక్తికి 12 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు బుధవారం తీర్పు చెప్పారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. శంఖవరం మండలం గొంది గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన గంటిమల్లె సతీష్ బెదిరించి వివాహం చేసుకుంటానని, శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం పెళ్లికి నిరాకరించడంతో ఆ మహిళ అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 2023 డిసెంబర్‌లో అప్పటి అన్నవరం ఎస్‌ఐ బి.అజయ్ బాబు ముద్దాయి గంటిమల్లె సతీష్‌పై అత్యాచారం కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు ఈ కేసు విచారణ జరిపి రాజమహేంద్రవరం ఎనిమిదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం గంటిమల్లె సతీష్‌కు 12 ఏళ్ల శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మరో ఘటనలో ఏడాది..

కోటనందూరు: స్థల వివాదం కేసులో ముద్దాయికి ఏడాది జైలు, రూ. 10 వేల జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2022లో ఇండుగపల్లికి చెందిన గుడివాడ మంగ తన మరిది గుడివాడ వెంకటేశ్వరరావు (నానాజీ) ఇంటి స్థలం విషయంలో గొడవ పడ్డారు. ఇంటి స్థలం తనదని వెంకటేశ్వరరావు మంగపై దాడి చేశాడు. మంగ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. ఈ కేసు బుధవారం విచారణకు రాగా వెంకటేశ్వరరావుకు పైశిక్ష పడింది.

దారి దోపిడీ ఘటనలో నిందితుల అరెస్ట్

రాజానగరం: దివాన్‌చెరువు జీరో పాయింట్ నుంచి గామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో దారి దోపిడీ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేశామని స్థానిక సీఐ ఎం.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీరామపురానికి చెందిన వరద మణికంఠ పండ్ల వ్యాపారం చేస్తూ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా, కుంటలో నివాసం ఉంటున్నాడు. పండ్ల వ్యాపారంలో భాగంగా ఈ నెల 22న కుంట నుంచి దివాన్‌చెరువు పండ్ల మార్కెట్‌కు తన వ్యాన్‌లో వస్తూ, గామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో కొంతమూరు సమీపంలో నయారా పెట్రోలు బంకు వద్దకు వచ్చే సరికి బహిర్భూమికి వెళ్లేందుకు ఆగాడు. తర్వాత వ్యాన్ వద్దకు వస్తున్న అతనిపైకి అదే ప్రాంతంలో మాటువేసి ఉన్న కొంతమూరు జంగాల కాలనీలో నివాసం ఉంటున్న సాలా బలరామ్ అలియాస్ డిజె అనే బల్లా, బలం ఏసులు ముఖాలకు ముసుగులు వేసుకుని అతనిపై దాడి చేశారు. అతని మెడపై కత్తి పెట్టి చంపేస్తామని బెదిరించి, చేతికి ఉన్న రెండు బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్, జేబులో ఉన్న రూ.10 వేలను తీసుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాజానగరం పోలీసులు రెండు రోజుల్లోనే ముద్దాయిలను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ఈ కేసులో అరెస్టయిన నిందితులు ఇద్దరూ చెడు వ్యసనాలకు అలవాటు పడి, దొంగతనాలకు పాల్పడి, జైలుకు కూడా వెళ్లివచ్చారు. అయినప్పటికీ వారిలో పరివర్తన రాలేదని సీఐ అన్నారు.

జగ్గంపేట సీహెచ్‌సీలో అరుదైన సంఘటన


జగ్గంపేట సీహెచ్‌సీలో 4.5 కిలోల ఆడ శిశువుతో తల్లి, ఆసుపత్రి వైద్యులు

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సాధారణ కాన్పు ద్వారా 4.5 కిలోల బిడ్డకు జన్మనివ్వడం అరుదైన సంఘటనని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ తెలిపారు. బుధవారం జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామానికి చెందిన గర్భిణి టి.అచ్చివేణికి నెలలు నిండడంతో కాన్పు కోసం ఆసుపత్రిలో చేరింది. ఆమెకు అన్ని పరీక్షలు నిర్వహించి ప్రసవానికి సిద్ధం చేశారు. ప్రసూతి వైద్య నిపుణులు భాగ్యలక్ష్మి, వర్మ పర్యవేక్షణలో అచ్చివేణి సాధారణ కాన్పులో 4.5 కిలోల బిడ్డకు జన్మనిచ్చింది. అయితే సాధారణంగా కడుపులో బిడ్డ 3.5 కిలోలు ఉంటే కచ్చితంగా ఆపరేషన్ చేసి బయటకు తీస్తారు. అలాంటి అవసరం లేకుండా డాక్టర్లు సాధారణ కాన్పు చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

పరుగులు పెట్టిస్తున్న పులి

- ముమ్మరంగా గాలిస్తున్న అధికారులు
- ట్రాప్, సీసీ కెమెరాల ఏర్పాటు


కడియంలోని ఓ నర్సరీలో ఏర్పాటు చేసిన బోను

రాజమహేంద్రవరం రూరల్/కడియం: కొద్ది రోజులుగా చిరుత పులి అందరినీ పరుగులు పెట్టిస్తోంది.. ఎక్కడా చిక్కకుండా తిరుగుతోంది.. ఎప్పుడు ఎక్కడ ప్రత్యక్షం అవుతుందో తెలియక జనంతో పాటు అధికారులూ తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది.. ఆ చిరుత పులి నుంచి ఎవరికి ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం అందరిలో వెంటాడుతోంది. కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులో దోసాలమ్మ కాలనీ సమీపంలోని ఎస్ఎస్‌టీసీ నర్సరీలో మంగళవారం రాత్రి చిరుతపులి పాదముద్రలు గుర్తించారు. ఇవి దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో తిరిగిన పులి పాదముద్రలతో సరిపోలడంతో అది ఇక్కడకు వచ్చిందని నిర్ధారణకు వచ్చారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులూ ధ్రువీకరించారు. అయితే బుధవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షం కారణంగా పులి పాదముద్రల ఆనవాళ్లు పోయాయి. చిరుతపులి కదలికలను గుర్తించడానికి పలుచోట్ల ట్రాప్, సీసీ కెమెరాలను అమర్చారు. జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి ఆధ్వర్యంలో చిరుతపులి కదలికలను గుర్తించడానికి ఐదు బృందాలుగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. దాని జాడ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి మాట్లాడుతూ వరద సమయంలో గోదావరి మీదుగా వచ్చినట్లు భావించిన చిరుత పులి బుర్రిలంక సమీపంలోని లంకల్లో జింకలు ఉంటాయని అటువైపు వెళ్తున్నట్లు భావిస్తున్నామన్నారు. కడియం నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడామని, వారి పూర్తి సహాయ సహకారాలు అటవీశాఖ సిబ్బందికి అందజేస్తున్నారన్నారు. నర్సరీలో పనిచేసే వారికి, చుట్టుపక్కల గ్రామస్తులకు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. అటవీ శాఖ సిబ్బందికి అంతా సహకరించాలని, అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు. అసత్య ప్రచారాలకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని భరణి హెచ్చరించారు.

చిరుత సంచారంపై ఆరా

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్తూ కడియపులంక గ్రామంలో ఆగి చిరుత పులి సంచారంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ చిరుత పులి అని దాని కదలికలు, పాదముద్రల ద్వారా నిర్ధారించామని వివరించారు. ట్రాప్ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేస్తున్నామని, మనుషులపై దాడిచేసే అవకాశం లేదని, వర్షం వల్ల చిరుత ఎక్కడో నక్కిందని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా చిరుతను పట్టుకుని ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. దాని కదలికల కోసం ప్రయత్నిస్తున్నామని భరణి మంత్రికి వివరించారు.


నర్సరీలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరా

పనులకు రాని కూలీలు

కడియం నర్సరీల్లో చిరుత పులి సంచారం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో నర్సరీలో పనిచేసే కూలీలు కానీ, ఎగుమతి దిగుమతులు చేసే జట్టు కూలీలు కానీ పనులకు రావడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ చిరుత పులిని పట్టుకునే ఏర్పాట్లను వేగవంతం చేయాలని నర్సరీ రైతులు కోరుతున్నారు.

వదినను హత్య చేసిన మరిది


డోకుబుర్ర బుజ్జి (ఫైల్)


బలభద్రపురంలో ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ గణేష్

బిక్కవోలు: వదినను మరిది హత్య చేసిన ఘటన బలభద్రపురం గ్రామంలోని చోటుచేసుకుంది. బుధవారం అనపర్తి సీఐ గణేష్ కథనం ప్రకారం.. బలభద్రపురం కొత్త కాలనీలో డోకుబుర్ర బుజ్జి (40) తన భర్త గణేష్ మృతి చెందడంతో కొడుకు, కూతురితో కలసి ఉంటోంది. తన ఇంటి ఎదురుగానే మరిది డోకుబుర్ర గంగరాజు నివాసం ఉంటున్నారు. గంగరాజు, బుజ్జి కుమారుడు సునీల్‌లు గ్రామంలో ఏదో విషయమై ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో సునీల్ చొక్కా చిరిగిపోవడంతో ఇంటికొచ్చిన కొడుకుని బుజ్జి అడిగింది. దీంతో బాబాయ్ కొట్టాడని చెప్పడంతో బుజ్జి ఎదురింట్లో నివాసం ఉంటున్న మరిది గంగరాజును నిలదీసింది. కోపంతో ఊగిపోయిన అతను వెంటనే అక్కడే ఉన్న రాయితో బుజ్జి తలపై మోదాడు. ఆమె పరుగు పెట్టబోయింది. చీర అడ్డురావటంతో ముందుకు పడిపోయింది. వెనుక వచ్చిన మరిది మళ్లీ ఆమెను కొట్టడంతో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. ఈ ఘటనా స్థలాన్ని సీఐ గణేష్, ఎస్సై రవిచంద్ర పరిశీలించారు. వీఆర్వో మాచవరపు శ్రీనివాస ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి సీహెచ్‌సీ తరలించారు. గంగరాజును పోలీసు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మండల స్థాయి అధికారులకు ముగిసిన శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫ్యాకల్టీ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ)లో ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ బుధవారం సాయంత్రంతో ముగిసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ, ఏలూరు జిల్లాల్లోని అధికారులకు ఈ నెల 17 నుంచి ప్రారంభించిన శిక్షణ ముగిసింది. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు, అధికారుల విధులతో పాటు పంచాయతీ రాజ్ చట్టంపై 155 మందికి శిక్షణ ఇచ్చినట్లు ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ జీవీఎస్ శ్రీదేవి తెలిపారు. శిక్షణ పొందిన మండల స్థాయి అధికారులు ఆయా మండలాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు, పద్మజ, పార్థసారథిరావు, కేఎస్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

కె.గంగవరం: బాలికపై అత్యాచారం కేసులో దత్తత తండ్రిని అరెస్టు చేసినట్లు ఎస్సై జానీబాషా బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కె.గంగవరం రైల్వే కాలనీలో సత్తిబాబు తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. సత్తిబాబుకు పిల్లలు లేకపోవడంతో భార్య చెల్లెలి కుమార్తెను దత్తత తీసుకున్నాడు. బాలిక అసలు తల్లి కుటుంబ పోషణ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. ఈ నేపథ్యంలో దత్తత తీసుకున్న కుమార్తెపై అతను లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె గర్భవతి కావడంతో ఒక శిశువుకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో ఆమె చికిత్స అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో 2022లో కేసు నమోదు చేశారు. దీంతో ఆ కేసును కె.గంగవరం పోలీసులకు ట్రాన్స్‌ఫార్ చేశారు. రెండేళ్ల నుంచి పరారీలో ఉన్న సత్తిబాబును ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి ఆర్టీసీ కాలనీలో కె.గంగవరం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

చోరీ కేసులో ఏడాది జైలు

రాయవరం: ఆలయంలో హుండీ చోరీ చేసిన ముద్దాయికి అనపర్తి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బుధవారం ఏడాది జైలు శిక్ష విధించారు. మండపేట రూరల్ సీఐ దొరరాజు వివరాల ప్రకారం.. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో 2022 అక్టోబరు 20న హుండీ చోరీ జరిగింది. దీనిపై అప్పటి ఆలయ ఈఓ అయ్యప్ప ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్సై సురేష్ కేసు నమోదు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌కు చెందిన ఓరుగంటి ఏసు హుండీ పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. సదరు కేసులో వాదోపవాదాల అనంతరం ఏసు నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష పడిందని సీఐ తెలిపారు.

చప్పుడు కాకుండా వస్తారు... దోచుకెళ్తారు

- చోరీ కేసులో ఇద్దరి అరెస్టు
- రూ.15.30 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

కంబాల చెరువు (రాజమహేంద్రవరం): ఇంట్లో అంతా నిద్రిస్తుండగా చప్పుడు కాకుండా వస్తారు.. సొత్తు దోచుకుని దర్జాగా ఉడాయిస్తారు. జిల్లాలోని కొవ్వూరులో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తుల్ని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.15.30 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ రాజమహేంద్రవరం దిశా పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 26న కొవ్వూరు ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో నివసిస్తున్న కట్టా ఉష ఇంట్లో దొంగతనం జరిగింది. వారి కుటుంబ సభ్యులంతా ఇంట్లో నిద్రిస్తుండగానే గుర్తు తెలియని దొంగలు వెనుక గుమ్మం నుంచి ప్రవేశించి బీరువాలోని నగలు, స్కూటీతో ఉడాయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.విశ్వం ఆధ్వర్యంలో సిబ్బందిని రెండు బృందాలుగా విభజించి దర్యాప్తు చేశారు. నిందితుల వేలిముద్రల ఆధారంగా పాత నేరస్తుడైన కాకినాడకు చెందిన ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉంటున్న పొన్నాడ రవిశంకర్ వీరబాబు, భీమవరానికి చెందిన పాత నేరస్తుడు లంకలపల్లి నాగరాజు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. వారిపై నిఘా పెట్టి నిందితుల్ని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి 50 కాసుల బంగారం, సెల్ ఫోన్, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. మణిపురం ఫైనాన్స్ కంపెనీలో వీరు తాకట్టు పెట్టిన కొత్త బంగారాన్ని స్వాధీనం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. పొన్నాడ రవిశంకర్ వీరబాబుపై ఇప్పటి వరకూ తూర్పు, పశ్చిమ, విశాఖ జిల్లాల్లో మొత్తం 44 చోరీ కేసులు ఉన్నాయి. వాటిలో 14 కేసుల్లో శిక్ష అనుభవించి గత ఏప్రిల్‌లో జైలు నుంచి విడుదలయ్యాడు. మరో ముద్దాయి లంకలపల్లి నాగరాజుపై లంకలకోడేరు పోలీస్ స్టేషన్లో హత్యాయత్నం, క్రికెట్ బెట్టింగ్ కేసులు ఉన్నాయి. వీరు జైలుకు వెళ్లి వచ్చినా తీరు మార్చుకోకపోవడం వీరి నేర ప్రవృత్తికి అద్దం పడుతోంది. నిందితుల్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

వరద బాధితులకు విరాళం



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విరాళం అందజేస్తున్న చిట్టూరి విజయప్రకాష్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ముఖ్యమంత్రి వరద సహాయ నిధికి శ్రీప్రకాష్ విద్యాసంస్థలు రూ.10 లక్షల విరాళం అందజేశాయి. ఈ విరాళాన్ని శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత చిట్టూరి విజయప్రకాష్ విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ సీహెచ్ వీకే నరసింహారావు మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు కొంత ఉపశమనం కలగాలనే ఉద్దేశంతో సహాయం చేశామన్నారు. ప్రభుత్వానికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.